ఆటల పండగ వచ్చే.. ఆనందం తెచ్చే!



సభలో స్పోర్ట్స్ కిట్‌ను అందజేస్తున్న సీఎం వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి

రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్. జగన్‌మోహన్‌రెడ్డి మంగళవారం నల్లపాడు లయోలా పాఠశాలలో ఆడుదాం ఆంధ్రా కార్యక్రమాన్ని ప్రారంభించిన నేపథ్యంలో యువత, విద్యార్థులు పెద్దఎత్తున తరలివచ్చారు. ఆ ప్రాంతమంతా పండుగ వాతావరణం నెలకొంది. సీఎం జగన్ మామకు జేజేలు పలికారు. ఆనందంగా ఆడుకుంటాం.. అంతులేని ఆత్మవిశ్వాసంతో ముందుకు సాగుతాం అంటూ విద్యార్థులు, యువత నినదించారు. సంతోషం, సంబరాలు, కేరింతలతో మునిగితేలారు. ప్రాంగణమంతా ఉత్సాహభరిత వాతావరణం నెలకొంది. ఈ క్రమంలో 'సాక్షి'తో పలువురు మనోభావాలను పంచుకున్నారు.

– నెహ్రూనగర్/పట్నంబజార్



సభలో చిన్నారి నృత్యం



సభలో చిన్నారుల నృత్యం



జగన్ మామయ్యకు జేజేలు చెబుతున్న చిన్నారులు

క్రికెట్ అంటే ఇష్టం



క్రికెట్ అంటే చిన్నప్పటి నుంచి చాలా ఇష్టం. మా వలంటీర్, సచివాలయ సిబ్బంది ఆడుదాం ఆంధ్రా కార్యక్రమంలో ఆటలు ఆడే వారి పేర్లు నమోదు చేసుకోమంటే నేనూ చేసుకున్నా. ఈ కార్యక్రమం ద్వారా క్రికెట్‌లో రాణించి తగిన గుర్తింపు పొందేందుకు అవకాశం కలిగింది.

– కె. జోస్ మ్యాథ్యూస్, 10వ తరగతి,

వినూత్న కార్యక్రమం



విద్యార్థుల్లో క్రీడా ప్రతిభను బయటకు తీసేందుకు సీఎం వైఎస్. జగన్‌మోహన్‌రెడ్డి ఆడుదాం ఆంధ్రా అనే వినూత్న కార్యక్రమానికి శ్రీకారం చుట్టడం అభినందనీయం. మేమంతా కబడ్డీ ఆడుతాం. ఇలాంటి కార్యక్రమాలు చేపట్టడం ద్వారా మాలో ఉన్న టాలెంట్‌ని ఒక వేదికగా బయట పెట్టేందుకు దోహదపడుతుంది.

– మోక్ష, రాజు, దయ, డింపు, జగదీష్, రాయుడు, మణికంత, ఇంటర్ ద్వితీయ

మంచి అవకాశం



ఖోఖో బాగా ఆడతా. ఆడుదాం ఆంధ్రా కార్యక్రమాన్ని ప్రభుత్వం ఏర్పాటు చేసి మాలాంటి వారికి మండల, నియోజకవర్గ, జిల్లా, రాష్ట్ర స్థాయిలో ఆడే అవకాశం కల్పించింది. మంచి గుర్తింపు తెచ్చుకునేందుకు ఇదొక చక్కని అవకాశం. ఇలాంటి కార్యక్రమాలకు ఏర్పాటు చేసి మాలోని క్రీడ ప్రతిభను బయటకు తీసేందుకు సీఎం వైఎస్. జగన్‌మోహన్‌రెడ్డి చేస్తున్న కృషి అభినందనీయం.

– కంచర్ల రూప పావని, ఇంటర్ ద్వితీయ

క్రీడలతో మానసికోల్లాసం



క్రీడలంటే మాకు చాలా మక్కువ. వాలీబాల్ ఇష్టంగా ఆడుతాం. మా సచివాలయ సిబ్బంది పేర్లు ఇవ్వాలనగానే వెంటనే మా పేర్లు ఇచ్చాం. క్రీడలతో మానసికోల్లాసంతో పాటు ఆరోగ్యంగా ఉండవచ్చు. వాలీబాల్‌తో ప్రతిభను బయటకు తీసేందుకు ఆడుదాం ఆంధ్రా ఒక వేదికగా భావిస్తున్నాం.

– ఎం. వెంకట్, కె. మహేష్, 10వ తరగతి

మహిళా క్రికెట్ జట్టులో ఆడటమే లక్ష్యం



క్రీడల్లో విద్యార్థినులు రాణించేందుకు ఆడుదాం ఆంధ్రా కార్యక్రమం ఎంతగానో దోహదపడుతుంది. మాకు క్రికెట్ అంటే ఇష్టం. అందులో రాణించి జాతీయ స్థాయిలో జరిగే మహిళా క్రికెట్ టోర్నమెంట్‌లో పాల్గొనడమే ఏకైక లక్ష్యంగా పెట్టుకున్నాం.

– పి. నిహారిక, ఎం. మౌనిక, ఇంటర్

వైఎస్‌కు భారతరత్న ఇవ్వాలని సంతకాల సేకరణ



సంక్షేమ సారథి దివంగత మహానేత డాక్టర్ వైఎస్. రాజశేఖర్‌రెడ్డికి భారతరత్న ఇవ్వాలని కోరుతూ సంతకాల సేకరణ గత మూడేళ్ల నుంచి చేస్తున్నా. ఇప్పటి వరకు 70వేల సేకరించా. మూడు లక్షల సంతకాల సేకరణ తర్వాత రికార్డును గవర్నర్‌కు పంపుతా.

– సీహెచ్. భాస్కర్‌రెడ్డి, చిలకలూరిపేట

క్లుప్తంగా

పెత్తందార్లతో పోరాడి అసువులు బాసిన రంగా



నగరంపాలెం: పేద, బడుగు, బలహీనవర్గాల ప్రజల అభివృద్ధి కోసం పెత్తందార్లతో జరిగిన పోరాటంలో బలైపోయిన పేద వర్గాల ప్రతినిధి వంగవీటి మోహన రంగా అని బజరంగ్ ఫౌండేషన్ వ్యవస్థాపకులు అంబటి మురళీకృష్ణ అన్నారు. గోరంట్ల ప్రధాన రహదారిపై మంగళవారం ఆవిష్కరించిన వంగవీటి మోహనరంగా కాంస్య విగ్రహానికి ఆయన పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పేద వర్గాల ప్రతినిధి అయిన వంగవీటి మోహన రంగాను అప్పట్లో రాజకీయంగా పైకి తీసుకొచ్చేందుకు వైఎస్.రాజశేఖర్‌రెడ్డి ఎంతగానో కృషి చేశారని తెలిపారు. ప్రస్తుత ప్రభుత్వం కూడా వంగవీటి మోహనరంగా ఆశయానికి రూపంగా ఉందని చెప్పారు. భవిష్యత్‌లో వంగవీటి మోహన రంగా ఆశయ సిద్ధి కోసం సీఎం వైఎస్. జగన్‌మోహన్‌రెడ్డి నాయకత్వంలో బడుగు, బలహీన, నిమ్నజాతి, పేద వర్గాలు పెత్తందారులపై ప్రజాస్వామ్య పోరాటానికి సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. పేద వర్గాల ఉన్నతి కోసం బజరంగ్ ఫౌండేషన్ అనేక సంక్షేమ కార్యక్రమాలను నిర్వహిస్తోందని తెలిపారు. ఈ ప్రభుత్వాన్ని పటిష్టం చేసేందుకు, వంగవీటి మోహనరంగా ఆశయ సాధన కోసం బజరంగ్ ఫౌండేషన్ సంక్షేమ కార్యక్రమాల్ని కొనసాగిస్తోందని చెప్పారు.

కళ్ల జోళ్ల పంపిణీ

పెదకాకాని: అంకితభావంతో బజరంగ్ ఫౌండేషన్ ప్రజాసేవను కొనసాగిస్తున్నట్లు వ్యవస్థాపకులు అంబటి మురళీకృష్ణ అన్నారు. ప్రజలకు ఇచ్చిన ప్రతి హామీని నెరవేర్చుతూ, ప్రజారంజక పాలన అందిస్తున్న రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్. జగన్‌మోహన్‌రెడ్డి స్ఫూర్తితో ప్రజాసేవలో ముందడుగు వేస్తున్నట్లు తెలిపారు. బజరంగ్ జగన్నామ సంక్షేమంలో భాగంగా సీఎం వైఎస్. జగన్‌మోహన్‌రెడ్డి పుట్టినరోజు పురస్కరించుకుని ఈనెల 21న ఉప్పలపాడులో జరిగిన బజరంగ్ సంగమం కార్యక్రమంలో నేత్రజ్యోతి పేరిట వైద్య శిబిరం నిర్వహించారు. ఇందులో పాల్గొన్న గ్రామస్తులు 609 మందికి కళ్లజోళ్లు అవసరమని డాక్టర్లు నిర్ధారించారు. వారికి మంగళవారం బజరంగ్ ఫౌండేషన్ వ్యవస్థాపకులు అంబటి మురళీకృష్ణ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సంక్షేమ సారథి సీఎం వైఎస్. జగన్‌మోహన్‌రెడ్డికి పేదలపై ఉన్న శ్రద్ధను విస్తృత స్థాయిలో ప్రజల్లోకి తీసుకు వెళ్లాలని బజరంగ్ ఫౌండేషన్ నిర్ణయించిందని తెలిపారు. నేత్ర సమస్యలతో బాధపడేవారికి ఊరట కలిగించి, వెలుగునిచ్చే కార్యక్రమంగా బజరంగ్ నేత్రజ్యోతి గ్రామీణ ప్రాంతాల్లో విస్తృతంగా పని చేస్తోందని పేర్కొన్నారు.

మహిళపై దాడి

గుంటూరు ఈస్ట్: మహిళపై దాడి చేసిన వ్యక్తిపై నగరంపాలెం పోలీసులు కేసు నమోదు చేశారు. నగరంపాలెంలో నివసించే షేక్ నిలోఫర్ తన ఇంటి బయట మేక పిల్లను కట్టివేసింది. పక్కనే నివాసం ఉండే ఖాజా మొహిద్దీన్ ఈనెల 25న ఎందుకు కట్టారంటూ నిలోఫర్‌తో గొడవపడి కర్రతో దాడి చేసి, గాయపరిచాడు. ఈ మేరకు మంగళవారం బాధితురాలు పోలీసులకు ఫిర్యాదు చేసింది. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

'ఆడుదాం ఆంధ్రా'తో యువత ప్రతిభకు ప్రోత్సాహం

పొన్నూరు: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఆడుదాం ఆంధ్రా కార్యక్రమం గ్రామీణ ప్రాంతాల యువతను ప్రోత్సహించి వారిలోని క్రీడా నైపుణ్యాన్ని వెలికితీసేందుకు దోహదపడుతుందని ఎంపీపీ భవనం పద్మలీల పేర్కొన్నారు. మండలంలోని పచ్చల తాడిపర్రు జెడ్పీ ఉన్నత పాఠశాల ఆవరణలో మంగళవారం క్రీడా పోటీల్ని ఆమె ప్రారంభించారు. క్రీడాకారులకు కిట్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ 47 రోజుల పాటు నిర్వహించే క్రికెట్, ఖోఖో, వాలీబాల్, కబడ్డీ, బ్యాడ్మింటన్ తదితర క్రీడా పోటీలు యువతలోని క్రీడా నైపుణ్యాన్ని పెంచుతాయని పేర్కొన్నారు. బాలబాలికలంతా ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆమె కోరారు. కార్యక్రమంలో ఎంపీడీవో శ్రీనివాసరావు, వైఎస్సార్ సీపీ జిల్లా ఎస్సీ సెల్ అధ్యక్షుడు పెరికల కృష్ణమోహన్, మండల నాయకులు, క్రీడాకారులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

పొన్నూరు పట్టణంలో..

జిల్లా పరిషత్ హైస్కూల్, నిడుబ్రోలు పీబీఎన్ కళాశాలలో ఆడుదాం ఆంధ్రా క్రీడా పోటీల్ని మున్సిపల్ కమిషనర్ నయీం అహ్మద్ ప్రారంభించారు. ఈ సందర్భంగా జరిగిన సభలో ఆయన మాట్లాడుతూ విద్యార్థులు, యువతకు చదువుతో పాటు క్రీడలపై ఆసక్తి పెంచేందుకే ప్రభుత్వం ఈ కార్యక్రమానికి శ్రీకారం చుట్టిందని తెలిపారు. ప్రతి ఒక్కరూ క్రీడల్లో పాల్గొనాలని యువతకు సూచించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ పట్టణ, మండల అధ్యక్షుడు ఎంఏ. మహమ్మద్, రుద్రపాటి ఆదిశేషులు, ఏఎంసీ చైర్మన్ ఆకుల వెంకటేశ్వరరావు, వ్యవసాయ సలహా మండలి సభ్యులు బి. రంగారావు, నాయకులు షేక్ సుభాని, దేవరకొండ గోపి, మాజీ కౌన్సిలర్ షేక్ షర్మిల పాల్గొన్నారు.



పచ్చల తాడిపర్రులో ఆడుదాం ఆంధ్రాను ప్రారంభిస్తున్న ఎంపీపీ పద్మలీల



పొన్నూరు పట్టణంలో వాలీబాల్ ఆడుతున్న పార్టీ పట్టణ అధ్యక్షుడు మహమ్మద్

ఆటలతో ఆరోగ్యం, ఆనందం

కాకుమాను: నేటి విద్యార్థులకు ఆరోగ్యంతో పాటు ఆనందాన్ని ఇవ్వడానికి ఆటల పోటీలు ఎంతగానో దోహదపడతాయని వ్యవసాయ సలహా మండలి జిల్లా చైర్మన్ నల్లమోతు శివరామకృష్ణ తెలిపారు. స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మంగళవారం ఆడుదాం ఆంధ్రాకు కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు.ఈ సందర్భంగా మాట్లాడుతూ నేటి పోటీ ప్రపంచంలో విద్యతో పాటు క్రీడలు ఎంతో ముఖ్యమని పేర్కొన్నారు. ఆటల్లో ప్రతిభ చూపిన విద్యార్థుల్ని గ్రామస్థాయి నుంచి దేశస్థాయికి తీసుకువెళ్లడమే ఆడుదాం ఆంధ్రా ముఖ్య ఉద్దేశమని ఆయన తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్ పసుపులేటి శివకుమారి, జేసీఎస్ మండల కన్వీనర్ పంగులూరి శ్రీనివాసరావు, తహసీల్దార్ జె.ప్రసాదరావు, ఎంపీడీవో రామకృష్ణ, ఎంఈవో–2 విజయ్ భాస్కర్, వ్యాయామ ఉపాధ్యాయుడు గోపి, పంచాయతీ కార్యదర్శి పూర్ణచంద్రరావు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.



కాకుమానులో పోటీలను ప్రారంభిస్తున్న శివరామకృష్ణ

అందరి మనిషి వంగవీటి రంగా



రంగా చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పిస్తున్న బలసాని కిరణ్ కుమార్



రంగా విగ్రహానికి పూల మాలలు వేసి నివాళులు అర్పిస్తున్న లాలుపురం రాము, నాయకులు

ప్రత్తిపాడు నియోజకవర్గ సమన్వయకర్త బలసాని కిరణ్ కుమార్

గుంటూరు రూరల్(కాకుమాను): వంగవీటి రంగా కేవలం ఒక వర్గానికి మాత్రమే చెందిన వ్యక్తి కాదని, అందరి మనిషని ప్రత్తిపాడు నియోజక వర్గ సమన్వయకర్త బలసాని కిరణ్ కుమార్ అన్నారు. స్థానిక పార్టీ కార్యాలయంలో మంగళవారం వంగవీటి వర్ధంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.ఈ సందర్భంగా కిరణ్ కుమార్ మాట్లాడుతూ అందరి మనస్సులో స్థానం సంపాదించుకున్న రంగా మంచి మనసున్న వ్యక్తి అని ఆయన కొనియాడారు. కార్యక్రమంలో గుంటూరు రూరల్, కాకుమాను, వట్టిచెరుకూరు మండలాల జెడ్పీటీసీ సభ్యులు, వివిధ మండలాల కన్వీనర్లు, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

లాలుపురంలో...

లాలుపురం గ్రామ ఆటో సెంటర్‌లో వంగవీటి రంగా వర్ధంతి సందర్భంగా ఆయన విగ్రహానికి పూల మాలలు వేసి నివాళులు అర్పించారు. గ్రామస్తులకు మిఠాయిలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో జీడీసీసీ బ్యాంకు చైర్మన్ లాలుపురం రాము, మండెల చిన వెంకటేశ్వరరావు, రంగా అభిమానులు పాల్గొన్నారు.

బడుగు, బలహీన వర్గాల ఆశాజ్యోతి

పొన్నూరు: బడుగు, బలహీనవర్గాల ఆశాజ్యోతి వంగవీటి మోహన రంగా అని మార్కెట్ యార్డ్ చైర్మన్ ఆకుల వెంకటేశ్వరరావు పేర్కొన్నారు. మోహన రంగా వర్ధంతి సందర్భంగా పట్టణంలోని రామ మందిరం వద్ద ఉన్న రంగా విగ్రహానికి పూజ మాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ పట్టణ అధ్యక్షుడు ఎంఏ. మహమ్మద్, నాయకులు బి. రంగారావు, అంబటి వెంకటేశ్వరరావు, ఎండేటి వెంకటసుబ్బయ్య, వట్టిప్రోలు రంగారావు పాల్గొన్నారు.

రైతులకు శనగ విత్తనాల పంపిణీ



కాకుమాను: మిచాంగ్ తుపాన్ కారణంగా పంటల్ని కోల్పోయిన ప్రతి రైతుకీ రాయితీపై శనగ విత్తనాలు అందజేస్తామని పొన్నూరు సబ్ డివిజన్ ఏడీఏ వి.రామకోటేశ్వరి తెలిపారు. మండలంలోని కాకుమాను, గార్లపాడు, కొమ్మూరు, బీకేపాలెం, కొండపాటూరు గ్రామాల్లో మంగళవారం రైతులకు 80 శాతం రాయితీపై శనగ విత్తనాలు పంపిణీ చేశారు.ఈ సందర్భంగా రామకోటేశ్వరి మాట్లాడుతూ గుర్తింపు కార్డు ఉన్న కౌలు రైతులకు కూడా విత్తనాలు పంపిణీ చేయనున్నట్లు తెలిపారు.రైతులంతా ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆమె కోరారు. కార్యక్రమంలో డీఆర్‌సీ ఏడీఏ హైమావతి, ఏవో కె.కిరణ్మయి, ఆయా గ్రామాల రైతులు పాల్గొన్నారు.

షాపులో చోరీ

గుంటూరు ఈస్ట్: షాపులో చోరీపై పట్టాభిపురం పోలీసులు కేసు నమోదు చేశారు. జేకేసీ కళాశాల సమీపంలో బి.సత్యనారాయణ కూల్‌డ్రింక్ షాపు నిర్వహిస్తున్నారు. మంగళవారం ఉదయం తెరిచేందుకు వెళ్లగా షాపు తాళాలు పగులగొట్టి ఉన్నాయి. లోపలకు వెళ్లి పరిశీలించగా గల్లా పెట్టెలోని రూ. 40వేలతో పాటు కొంత సరుకు చోరీకి గురైనట్లు గుర్తించి పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

వివాహిత అదృశ్యం

వివాహిత కనిపించకుండా పోయిన ఘటనపై అరండల్‌పేట పోలీసులు కేసు నమోదు చేశారు. బొంగరాలబీడుకు చెందిన వివాహిత కుటుంబ కలహాల నేపథ్యంలో ఇంట్లో ఎవరికీ చెప్పకుండా ఎటో వెళ్లిపోయింది. కనిపించకుండా పోయినట్లు నిర్ధారించుకున్న కుటుంబ సభ్యులు మంగళవారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

అభివృద్ధి, సంక్షేమం వైఎస్సార్ సీపీకే సాధ్యం


రాజ్యసభ సభ్యుడు ఆళ్ల అయోధ్య రామిరెడ్డి, ఎమ్మెల్యే కిలారి వెంకటరోశయ్య



పెదకాకానిలో సచివాలయాన్ని ప్రారంభిస్తున్న ఎంపీ అయోధ్యరామిరెడ్డి, ఎమ్మెల్యే రోశయ్య

పెదకాకాని: అభివృద్ధి, సంక్షేమం వైఎస్సార్ సీపీకే సాధ్యమని రాజ్యసభ సభ్యుడు ఆళ్ల అయోధ్య రామిరెడ్డి, ఎమ్మెల్యే కిలారి వెంకటరోశయ్య స్పష్టం చేశారు. పెదకాకానిలో మంగళవారం ఆడుదాం ఆంధ్రా ఆటలతో పాటు రూ. 40 లక్షలతో నిర్మించిన సచివాలయం–1, గౌడపాలెంలో రూ. 4.70 లక్షలతో నిర్మించిన సీసీ రోడ్లు, రూ.11 లక్షలతో నిర్మించిన డాక్టర్ వైఎస్. రాజశేఖరరెడ్డి లైబ్రరీ, సర్దార్ గౌతు లచ్చన్న కమ్యూనిటీ హాలును వారు ప్రారంభించారు. వంగవీటి మోహన రంగా వర్ధంతి సందర్భంగా ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. పేదలకు దుప్పట్లు పంపిణీ చేశారు. అంగన్‌వాడీ వర్కర్లు, ఆయాలు అందించిన వినతిపత్రాన్ని అందుకుని, సమస్యను ప్రభుత్వం దృష్టికి తీసుకు వెళతామని తెలిపారు. ఈ సందర్భంగా సచివాలయం వద్ద ఏర్పాటు చేసిన సమావేశానికి పెదకాకాని పంచాయతీ కార్యదర్శి ఎం. రాజారాం, గౌడపాలెంలో ఏర్పాటు చేసిన సమావేశానికి గోళ్ల శ్యాం ముఖర్జీబాబు అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా రాజ్యసభ సభ్యుడు ఆళ్ల అయోధ్యరామిరెడ్డి మాట్లాడుతూ 70 ఏళ్లుగా పెదకాకానిలో ఒక చిన్న పంచాయతీ కార్యాలయంలోనే గ్రామానికి సంబంధించిన కార్యకలాపాలు కొనసాగేవని తెలిపారు. ప్రస్తుతం ప్రజలకు సౌలభ్యంగా ఉండేందుకు రూ.5 కోట్లతో ఐదు సచివాలయాలు, రైతు భరోసా కేంద్రాలు, హెల్త్ వెల్‌నెస్ సెంటర్లు నిర్మించినట్లు చెప్పారు. ఆరోగ్యశ్రీని రూ. 25 లక్షలకు పెంచి నూతన కార్డులు మంజూరు చేస్తున్న ఘనత వైఎస్సార్ సీపీ ప్రభుత్వానికే దక్కిందని చెప్పారు. రానున్న ఎన్నికల్లో సీఎం వైఎస్. జగన్‌మోహన్‌రెడ్డి, స్థానిక ఎమ్మెల్యే కిలారి వెంకట రోశయ్యను మంచి మెజారిటీతో గెలిపించాలని ప్రజలకు పిలుపునిచ్చారు. ఎమ్మెల్యే కిలారి వెంకటరోశయ్య మాట్లాడుతూ మహాత్మాగాంధీ కలలు కన్న గ్రామ స్వరాజ్యం సీఎం వైఎస్. జగన్‌మోహన్‌రెడ్డి ద్వారా సాధ్యమైందని తెలిపారు. ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన మాట ప్రకారం అన్ని హామీలను నెరవేర్చిన ఘనత ఆయనకే దక్కిందని ప్రశంసించారు. టీడీపీ నాయకులు అసత్య ప్రచారాలతో గద్దెనెక్కి అన్ని వర్గాల ప్రజల్ని మోసం చేశారని గుర్తు చేశారు. కార్యక్రమంలో ఎంపీపీ తుల్లిమిల్లి శ్రీనివాసరావు, జెడ్పీటీసీ సభ్యురాలు గోళ్ల జ్యోతి, ఎంపీడీవో బి.వి. మల్లేశ్వరరావు, గ్రామ సర్పంచి గోళ్ల స్వరూపరాణి, మాజీ ఎంపీపీ దోసపాటి నాగేశ్వరరావు, ఎంపీటీసీ సభ్యులు షేక్ గుల్జార్, బంగారు మరియమ్మ, మాతంగి నిర్మల, ఎంఎస్ఎంఈ డైరెక్టర్ భీమవరపు విజయలక్ష్మి, మాదా రాధ, మండల కన్వీనర్ చాగంటి మురళీమోహన్‌రెడ్డి, ట్రస్టు బోర్డు చైర్మన్ అమ్మిశెట్టి శివశంకరరావు, ట్రస్టు బోర్డు డైరెక్టర్ కారంకి నాగేశ్వరమ్మ , ప్రముఖ న్యాయవాది కారంకి లక్ష్మీనారాయణ, బండెల ఉదయ్‌శంకర్, సయ్యద్ సుభాని పాల్గొన్నారు.


పెదకాకానిలో గాంధీ, రంగా విగ్రహాల ఆవిష్కరణ



పెదకాకాని సెంటర్‌లో విగ్రహాలను ఆవిష్కరిస్తున్న కాపు సంఘ నాయకులు

పెదకాకాని: స్థానిక ప్రధాన సెంటర్‌లో ఆర్చి పక్కన జాతిపిత మహాత్మా గాంధీ, వంగవీటి మోహన రంగా విగ్రహాలను ఆవిష్కరించారు. మండల కాపు సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమంలో పొన్నూరు వ్యవసాయ మార్కెట్ డైరెక్టర్ బండెల ఉదయ్ శంకర్, పెదకాకాని మండలనేని నాగబాల మంగళవారం విగ్రహాల్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వంగవీటి మోహన రంగా ప్రాణాన్ని పణంగా పెట్టి పేదలు, బడుగు, బలహీన వర్గాల కోసం ఆమరణ నిరాహార దీక్ష చేశారన్నారు. ఆ మహానుభావుడిని స్మరించుకొని, గుర్తించుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందని తెలిపారు. అనంతరం అన్నదానం నిర్వహించారు. కార్యక్రమంలో కాపు సంఘం నాయకులు ఆలపాటి రాఘవ, గాదె రవి, బండారు తిరుమల, కోన ప్రసాద్, బండారు అప్పారావు, బండారు శ్రీనివాసరావు, కోటిపల్లి రాధాకృష్ణ, కోటిపల్లి రాజేష్, గుడి శివన్నారాయణ, తడవర్తి కోటేశ్వరరావు, తోట సాంబ, ధరణి, గోపి శ్రీకాంత్, రంగా అభిమానులు పెద్దఎత్తున పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో అయ్యప్ప పడి పూజ



కొరిటెపాడు: గోరంట్లలోని శ్రీ ప్రసన్నాంజనేయస్వామి దేవాలయంలో మాజీ సర్పంచ్ యర్రంశెట్టి వేణుగోపాల్ ఆధ్వర్యంలో దీక్ష స్వీకరించిన స్వాములకు 41 రోజుల సద్ది మంగళవారం ముగింపు సందర్భంగా అయ్యప్ప స్వామి పడి పూజ నిర్వహించారు. ముఖ్య అతిథిగా వేద సీడ్స్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ తులసి ధర్మచరణ్ పాల్గొని, స్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వాములకు, భక్తులకు సద్ది వడ్డించారు. అనంతరం మాట్లాడుతూ సద్ది ఏర్పాట్లను మహా యజ్ఞంలా భావించి విజయవంతంగా నిర్వహించారని అభినందించారు. కార్యక్రమంలో ట్రిపుల్ ఎక్స్ సోప్స్ అధినేత అరుణాచలం మాణిక్యవేల్, కంచర్ల ఆంజనేయులు, ఆతుకూరి వెంకటేశ్వర్లు, సీహెచ్. కనకారావు, యర్రంశెట్టి సూరి, పులి శివకోటయ్య, ఆలయ కమిటీ సభ్యులు, గ్రామస్తులు పాల్గొన్నారు.